# 'రైతుకూలీ రాజ్యంకోసం పోరుసల్పటమే కా॥కోటయ్యకు అర్పించే సరైన నివాళి'

## విప్లవ కమ్యూనిస్టునేత కా॥కొప్పుల కోటయ్య ప్రథమ వర్ధంతిసభలో వక్తల ఉద్ఘాటన



కామ్రేడ్ కోటయ్యగారి ప్రథమ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ఎస్.ఝాన్సి, వేదికపై ఇతర వక్తలు

**విజయవాడ, 1-12-2018 :**

విప్లవ కమ్యూనిస్టునేత, రైతుకూలీ ఉద్యమనాయకులు కా॥కొప్పుల మోహనరెడ్డి(కోటయ్య) మొదటి వర్ధంతి సభ డిసెంబర్ 1వ తేదీ ఉదయం స్థానిక ఐఎంఏ హాల్‌లో జరిగింది.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు **సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ** అధ్యక్షత వహించారు. తొలుత సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు, 'జనశక్తి' సంపాదకులు డా॥పి.జస్వంతరావు, కోటయ్యగారి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లర్పించారు. ఈ సభకు హాజరైన పలువురు నాయకులు, ప్రజాతంత్రవాదులు, కుటుంబ సభ్యులు, ఇతర ప్రజాసంఘాల నేతలు కోటయ్యగారి చిత్రపటం వద్ద పూలు వుంచి ఘనంగా నివాళులర్పించారు. అమరులు కా॥కోటయ్య స్మృతిలో సభికులంతా లేచి నిలబడి 2 నిముషాలు మౌనం పాటించిన అనంతరం ప్రజాకళాకారులు ఆయన స్మృతిలో విప్లవ గీతాలాలపించారు.

సభకు అధ్యక్షత వహించిన కా॥యస్.ఝాన్సీ మాట్లాడుతూ విప్లవ కమ్యూనిస్టు నేతగా, పీడిత ప్రజాఉద్యమ నాయకునిగా కా॥కోటయ్య చేసిన కృషిని గుర్తుచేశారు. తెలంగాణా సాయుధ పోరాటకాలంలో బాలసంఘం కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించిన కా॥కోటయ్య, విజయవాడలో కార్మిక, ప్రజాసంఘాలు నిర్మించి బాధ్యత వహించారని, పేదల నివాస కాలనీల ఏర్పాటులో మిలిటెంట్‌గా ప్రజలకు నాయకత్వం నెరిపారని గుర్తుచేశారు. నల్గొండజిల్లాలో కరవు సమస్యపై లోతుగా అధ్యయనంచేసి పరిష్కార మార్గాలను సూచిస్తూ విస్తృత, ప్రచార ఆందోళనలకు నాయకత్వం వహించారన్నారు. రైల్వే కార్మికుల సమ్మెలో కీలకంగా పాల్గొన్నారని తెలిపారు. 2001 నుండి మరణించేవరకూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారని, అన్ని జిల్లాలలో పర్యటించి గిరిజన, పీడిత, రైతాంగ ఉద్యమాలకు కొండంత అండగా నిలిచారని గుర్తుచేశారు. రైతుకూలీ ఉద్యమాలలో మమేకమవటంతోపాటు, కార్యకర్తల, ప్రజల కుటుంబాల సాధకబాధకాలు విచారిస్తూ వారికి తలలో నాలుకలాగా వ్యవహరించటం ఆయన ప్రత్యేకతగా వివరించారు. పోలీసుల చిత్రహింసలు, పలుమార్లు నిర్బంధానికి గురైనా, మొక్కవోక కడదాకా విప్లవ ఆశయానికి కట్టుబడి నిలిచారని పేర్కొంటూ, ఆ మార్గాన ముందుకు సాగటమే ఆయనకు అర్పించే నివాళిగా పేర్కొన్నారు.

**సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు, 'జనశక్తి' సంపాదకులు డా॥పి.జస్వంతరావు** మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలను విశ్లేషించారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి అమలువంటి వినాశకర చర్యలతో అంతిమంగా సామాన్య ప్రజానీకపు జీవనం కుదేలైందన్నారు. రక్షణ రంగంతో సహా, దేశంలో కీలకమైన విభాగాలన్నింటా సామ్రాజ్యవాదుల ప్రవేశాన్ని వేగవంతంచేయటమేగాక, పీకలలోతు అవినీతిలో మోదీ ప్రభుత్వం కూరుకుపోయిందన్నారు. ప్రజల నిత్యజీవన సమస్యలను పరిష్కరించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల, మత, ప్రాంతీయ తత్వాలు రెచ్చగొడుతూ ప్రక్కదోవ పట్టిస్తున్నారన్నారు. దోపిడీశక్తుల ఈ పన్నాగాలను గుర్తెరిగి ప్రజలంతా ప్రజాఉద్యమాలలో సమీకృతులవ్వాలని పిలుపునిచ్చారు. నల్గొండజిల్లాలో 1980లలో తీవ్రకరవు నేపథ్యంలో, రైతాంగపు మోటార్లు కాలిపోతున్న నేపథ్యంలో కా॥ కోటయ్య నాయకత్వంలో ఈ సమస్యపై అధ్యయనం చేసి సాగించిన ఆందోళన ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించిందన్నారు. కరీంనగర్ జిల్లాలో అమరుడు కా॥ ఎన్.వి. కృష్ణయ్య ఇదే తరహా సమస్యపై ప్రజలను కదలించటంతో పి.వి.నరసింహారావు దిగివచ్చి పోచంపాడు వరద కాల్వకు శంఖుస్థాపన చేశాడని గుర్తుచేశారు. పాలకులు నీటి పారుదల గురించి అదేపనిగా మాట్లాడుతూ వస్తోన్నా ఇన్ని సం॥ల తర్వాతకూడా పరిస్థితుల్లో మార్పులేదని వివరించారు.

రైతాంగాన్ని భూములనుండి బలవంతం గానూ, ఆర్థిక మీటలతోనూ తరలించివేసేందుకు పాలకులు చర్యలు చేపడుతున్నారని గుర్తుచేశారు. రైతుకు పంట ఖర్చులను ఒకవైపు పెంపుచేస్తూ, సంస్థాగత రుణాలను నామమాత్రం చేస్తూ, పంటలకు న్యాయమైన ధర కల్పించకుండా గాలికొదిలేస్తున్నారని, ఫలితంగా రుణాల ఊబిలో కూరుకు పోయిన రైతాంగం, ప్రధానంగా కౌలు రైతాంగం, పెద్దసంఖ్యలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆత్మహత్యలు సమస్యను పరిష్కరించవని తెలియ జేశారు. ఈ నేపథ్యంలో కా॥ కోటయ్య ఆశయ సాధనకోసం పీడిత, ప్రజాఉద్యమాలలో సమీకృతం కావటమే ఆయనకు అర్పించే నివాళిగా కా॥జస్వంతరావు పేర్కొన్నారు.

**సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కా॥గుర్రం విజయకుమార్** మాట్లాడుతూ బిజెపితో నిన్నటివరకూ అంటకాగిన తెలుగుదేశం పార్టీ, నేడు కాంగ్రెస్‌తో చెట్టాపట్టాలేసుకుంటూ ఇదంతా ప్రజాప్రయోజనం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని వంచిస్తున్నారని వివరించారు. 1968లో 'జనశక్తి' కార్యాలయంపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ కా॥ కోటయ్య మిలిటెంట్‌గా నిలిచారని, ఆ సందర్భంగానే తనకు మొదటగా ఆయనతో పరిచయం ఏర్పడిందని గుర్తుచేసుకున్నారు. గిరిపురం అరుల్‌నగర్ ఇళ్ళస్థలాలకోసం, నిడమానూరు షుగర్‌ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం, పాతూరు, గుండిమెడ దళితులపై దాడులను ఎదుర్కోవటంలో కా॥కోటయ్య నాయకత్వంలో విశేష కృషి జరిగిందని గుర్తు చేసుకుంటూ ఆ కామ్రేడ్‌కు జోహార్లర్పించారు.

ఈ సభలో **రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ఎం.ఎస్.నాగరాజు, ఏఐకెఎమ్‌కెఎస్(ఒడిషా) నాయకులు కా॥ శ్రీకాంత్ మహంతి, ఏఐకెఎమ్‌కెఎస్(కర్ణాటక) నాయకులు కా॥సిహెచ్. మల్లిఖార్జునరెడ్డి, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్స్ సి.పెద్దన్న, జె.కిషోర్‌బాబు, ప్రజాతంత్రవాదులు నరహరశాస్త్రి** తదితరులు కోటయ్యకు నివాళులర్పిస్తూ మాట్లాడారు. రాష్ట్ర వ్యాపితంగా వివిధ జిల్లాల నుండి 300 మంది పైగా ప్రతినిధులు ఈ సభకు హాజరయ్యారు.

**ooooo**